
స్నేహం ప్రకృతి సహజమైంది, స్త్రీ పురుష వ్యత్యాసాలకు అతీతమైంది.
కానీ అనాదిగా సంఘం అదే ప్రకృతి కారణంగా ఆ స్నేహాన్ని అంగీకరించడంలేదు.
మారిన కాలంలో, చిన్నవైపోయిన, చెదరిపోయిన కుటుంబాల్లోని
స్త్రీలకు మానసికమైన తోడుకోసం ఒక్కోసారి పురుషులతో స్నేహం అవసరమవుతోంది.
అలాంటప్పుడు సంఘపు నీడపడి స్త్రీలు మీమాంసకు గురయ్యే స్థితి వస్తోంది.

డా. కె.వి. రమణరావు

# 9 మూడో మనిషి

చారి పి.ఎస్.





"నీకూ గ్రీన్ టీ యివ్వనా," అడిగాడు సిద్దూ ల్యాప్‌టాప్ పక్కనపెట్టి వంటింట్లోకి వెళ్తూ.

ముగ్ధ తను చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తకుండానే, "ఊఁ" అంది.

ఉక్కపోతగా ఉంది. సీలింగ్ ఫ్యాన్ గాలి వేడిగా ఉంది. దూరపు ఆకాశంలో అప్పుడప్పుడూ మెరుపులు కనిపిస్తున్నాయి, ఎప్పుడైనా ఉరుము వినిపిస్తోంది.

ముగ్ధ తలెత్తి బాల్కనీలోకి చూసింది. పెద్ద మెరుపు ఉరుముకి సంకేతం అని చిన్నప్పుడు సైన్సు మాస్టారు చెప్పినప్పట్నుంచి ఆమె మెరుపొచ్చినప్పుడంతా వాళ్లమ్మని చుట్టేసుకుని ఉరుము కోసం భయంగా ఎదురుచూసేది.

ఇలాంటప్పుడే సత్యజిత్ రే సినిమా 'అశని సంకేత్' గుర్తొస్తుంది. దాని గురించి సిద్దూ చెప్పాక చూసింది. ఆ మంచి సినిమా రాబోయే కరువు గురించి చెప్పినా, 'ఆడవాళ్లకు రాబోయే ప్రమాదాల గురించి వచ్చే సంకేతాలకు ఆ పేరు సరిపోతుంది,' అనిపించిందామెకు.

చల్లటి గాలి మొదలైంది. బాల్కనీ చూరుకి వేలాడుతున్న మువ్వలు కదిలి మంద్రంగా తాళం వేస్తున్నాయి.

తలెత్తి చూసింది. ఆవు మెడలో కట్టే మువ్వలు, లోహపు గొట్టాలు, ఎత్నిక్ బిళ్లలు సంపాయించి రంగుతాళ్లకు బిగించి వాళ్లింట్లో వేలాడదీసాడు సిద్దూ. ముగ్ధ చూసి సంబరపడితే మరొకటి తయారు చేసి ఇక్కడ కూడా వేలాడదీసాడు. 'చాలా ఓపిక మనిషి,' అనుకుంది ముగ్ధ.

సిద్దూ రెండు కప్పుల్లో టీ తెచ్చి ఆమెకు ఒకటి అందించి వెళ్లి టీపాయ్ ముందు కూర్చుని, "యే పుస్తకమది?" అన్నాడు.

"నువ్విచ్చిందే" అని పుస్తకం ముఖచిత్రం చూపించింది.

"అదా," అన్నాడు నవ్వుతూ.

“యిలాంటి మార్మికమైన ఆధునిక కవిత్వం నాలాంటి పాటకజనానికి అర్థమవుతుందా? అప్పుడు పద్యకవిత్వం, యిప్పుడు సర్రియల్ కవిత్వం ‘జటిలం నుంచి జటిలంలోకి’ అన్నట్టుంది. కథలే కాస్త మేలు,” అంది ముగ్ధ టీ సిప్ చేసి.

“సైంటిస్టులకంటే ముందుగా మనిషి మెదడు కణాల్లోకి వెళ్లి అక్కడి సమాచారాన్ని వెలికితీయాలని దాని ప్రయత్నం. ఆ కాలంలో భాష అంచులు చూపారు, యిప్పుడు భావపు లోతుల్లోకి వెళ్తున్నారు,” అన్నాడు సిద్ధూ.

“ముందు యీ మనసనే మాయాలోకాన్ని దాటాలిగదా,” అంది నవ్వుతూ ఖాళీ కప్పును కిందపెట్టి.

దగ్గరగా మెరుపులు, ఉరుములతో వర్షం మొదలైంది. సిద్ధూ లేచి ప్లాస్టిక్ కుర్చీలు రెండు పట్టుకుని, “బాల్కనిలో కూర్చుందాం రా. పన్నెండంతస్తుల భవనాల యీ గేటెడ్ కమ్యూనిటి తొమ్మిదో అంతస్తులో పిడుగు నీమీద పడదు. నాదీ హామీ,” అన్నాడు.

“ఆ మెరుపులను, వురుములను భరించే శక్తి మనుషులకు వచ్చే మ్యుటేషన్ యింకా జరగలేదు, నువ్వు పక్కనే వున్నావు కాబట్టి వస్తున్నా,” అంటూ లేచి వెళ్లింది ముగ్ధ.

బాల్కనీల లైట్ల వెలుగులో మెరుస్తూ ధారగా పడుతున్న నీటి బిందువుల్ని మౌనంగా చూస్తూ కూర్చున్నారు. దూరం పెరిగేకొద్దీ చీకట్లో వర్షం నీడలుగా జారుతోంది.

ముగ్ధ ఏదో అడగబోయి, ‘ఇలాంటప్పుడు సిద్ధూ మాట్లాడడు. మనం మనల్ని మరచిపోయి యెదుటి దృశ్యంలో లీనమైన క్షణాలే నిజంగా బతికినట్టు అంటాడు,’ అనుకుని ఆగింది. ‘అదే ఆదిత్య అయితే వర్షపు శబ్దానికి పోటీగా గలగలా మాట్లాడుతూ, ఎప్పటిదో ఒక ఎపిసోడ్ ఆసక్తికరంగా చెప్తూ వాతావరణాన్ని ఉత్తేజ పరుస్తాడు, ఇప్పుడెక్కడో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి పక్కవాళ్లని నవ్విస్తూ ఉంటాడు,’ అనుకుంది నవ్వుకుని.

“యిలా నిశ్శబ్దంగా కూర్చోడానికి మరోమనిషి కంపెనీ అవసరమేముంది?” అనడిగింది ఒకసారి సిద్ధూని.

“డిస్టర్బ్ చెయ్యనంతవరకూ నువ్వు, నేనూ కూడా ఆ విశ్వదృశ్యంలో భాగమేనని తెలుస్తుంది. తోడు ఉంటే దాని గాఢత పెరుగుతుంది,” అన్నాడు.

పావుగంట తరువాత వర్షం తగ్గింది.

“మీ కాలేజి స్టాఫ్ గొడవలు తగ్గాయా?” అన్నాడు సిద్దూ.

‘సిద్దూలో అదే ప్రత్యేకత, ఎదుటిమనిషి చికాకులను కూడా పంచుకోవాలనుకుంటాడు,’ అనుకుంది ముగ్ధ.

“యిప్పుడు ఫర్వాలేదు. నలుగురు మనుషులున్న చోటంతా అంతేనేమో. దగ్గరవుతుంటారు అంతలోనే దూరమవుతుంటారు. ‘మనుషులు గొప్ప అనుబంధాల్ని కోరుకుంటారుగాని దాన్ని భరించే శక్తి వాళ్లకు లే’దని దోస్తొయెవ్స్కి అన్నట్టు గుర్తు. శ్రుతి మించకుండా లక్ష్మణరేఖలు అందుకే గీసుకుంటారు కాబోలు. జగత్తులో యేదీ సంపూర్ణం, శాశ్వతం కాదుకాబట్టి స్నేహాలు కూడా పెరుగుతూ విరుగుతూ వుంటాయి. దేవుడిలాగ కనపడనివాళ్లతో యెంత అనుబంధమైనా పెట్టుకోవచ్చు, యే యిబ్బంది వుండదు,” అంది ముగ్ధ గలగలా నవ్వి.

ధారలు తగ్గి విడివిడిగా పడుతున్న చినుకులను చూస్తున్నారు.

ముగ్ధ చిన్నగా, ‘హాయ్ హాయ్ ఏ మజ్‌బూరి,’ పాటను హమ్ చేసింది.

“మొన్న రికార్డు చేసిన నీ కొత్తపాటలను యూట్యూబులో అప్‌లోడ్ చేసావా?” అడిగాడు సిద్దూ.

“యింకా లేదు. నా కాలేజి పనులు, యింటి పనులన్నీ చూసుకున్నాక మిగిలిన ఆ కొంచెం టైంలో పుస్తకాలు చదువుతున్నాను. యేదో సంగీతసాధన చేసుకుంటున్న నన్ను సాహిత్యం చదవమని బలవంతపెడతావెందుకు? అవి నా పాటల మీది యేకాగ్రతకు భంగం కలిగిస్తున్నాయి,” అంది ఆరోపణగా.

“ఆపాతమధురాన్ని ఆలోచనామృతంతో సమన్వయపరచుకో. నీ పాటకు యింకా నిండుదనం వస్తుంది. లత కంఠంలోలా నీ గొంతులోనూ లోలోపలి అనుభూతులు పలుకుతాయి,” అనునయంగా అన్నాడు.

“వసుమతి కొత్త హెచ్చార్ వుద్యోగం యెలా వుంది? వుద్యోగాన్ని తను చాలా యిష్టపడి చేస్తుంది,” మెచ్చుకోలుగా అంది, టాపిక్ మారుస్తూ.

“ఆమె థరో ప్రొఫెషనల్. వుద్యోగ లక్షణాలను బయట కూడా అమలు చేస్తుంది. చుట్టాలు, ఫ్రెండ్స్‌తో కలవడంలో ఆనందమెక్కువ. ఆమె కజిన్ కూతురు బర్త్‌డే పార్టీ అని వెళ్లింది. తొమ్మిదిన్నరకంతా వచ్చేస్తానంది.”

“నువ్వూ వెళ్లుండచ్చుగదా?”

“ఆదిత్య యీ అర్జెంటు పని వొకటి తగిలించాడు గదా. పైగా నాకు గుంపుల్లో మాస్కు తగిలించుకుని గడపడం యిబ్బందిగా వుంటుంది. వాడు వర్షంలో చిక్కుకోలేదు గదా?” అన్నాడు వాచీ చూసుకుని.

ముగ్ధ ఫోన్ మోగింది. లేచి చూడ్డానికి వెళ్లింది.

“నీ, ‘హాయ్ హాయ్ మజ్బూరి,’ చెమ్మగాలిలో ప్రయాణించి ఆదిత్యను చేరివుంటుంది. వాడి ఫోనే అయివుంటుంది చూడు,” అన్నాడు సిద్ధూ నవ్వుతూ.

“నిజమే, ఆది నుంచే ఫోన్,” అని రెండు నిముషాలు మాట్లాడి పెట్టేసి, “బేగంపేటలో వున్నాను, యింటికే వస్తున్నాను నేనొచ్చేవరకు సిద్ధూని వుండమను. యిదీ ఆదిత్య ఫోను సారాంశం,” అని, “డిన్నర్‌కి నువ్వేం తింటావు? బాయిల్డ్ వెజిటబుల్స్, పుల్కాలు ఓకేనా?” అంది ఫ్రిజ్ వైపు వెళ్తూ.

సిద్ధూ లేచివచ్చి టీవీ ఆన్ చేసి న్యూస్ ఛానెల్ పెట్టాడు. పెద్ద వర్షం వల్ల నగరంలో ఏర్పడిన నీటి ప్రవాహాలు, ట్రాఫిక్ ప్రతిష్టంభన గురించిన దృశ్యాలు చూపిస్తూ, ‘యిప్పుడు రోడ్ల మీద వున్నవాళ్లు యిళ్లకి చేరేసరికి చాలా సమయం పట్టవచ్చుని, కొత్తగా బయటికి ఎవరూ రావద్ద,’ని న్యూస్ రీడరు చెప్తున్నాడు. ఆ దృశ్యాల్లో బేగంపేట కూడా ఉంది.

“ఆది రావడానికి మరో రెండుగంటలైనా పడుతుంది. టైం తొమ్మిదవుతోంది. నేను వెళ్తాను. యింకో అరగంటలో వసుమతి యింటికి వచ్చేస్తుంది. ఆ యేరియాలో పెద్దగా వర్షం లేదు,” అన్నాడు సిద్ధూ.

“మరి నిన్నుండమని ఆది గట్టిగా చెప్పాడు. యేదో పని వున్నట్టుంది,” అంది.

“వాళ్ల బ్యాంకు యూనియన్‌కి అవసరమైన వొక సాఫ్ట్‌వేర్ పని నాకప్పగించాడు గదా. దాన్ని యిందాకే పూర్తిచేసాను. రేపు డిస్కస్ చేసినా సరిపోతుంది. నేవెళ్తున్నా,” అని తన బ్యాక్ ప్యాక్ సర్దుకుని బయలుదేరాడు సిద్ధూ.

తలుపువరకూ వెళ్లి, “బై, గుడ్ నైట్,” అంది ముగ్ధ.

ఆదిత్య లేకపోతే సిద్ధూ వెళ్లాక కొంచెంసేపు వెలితిగా వుంటుంది ముగ్ధకి. ‘చిన్నప్పుడు ఇంటికొచ్చి వెళ్లిపోయే బంధువులకు వీడ్కోలు చెప్పినప్పుడు ఇదే వెలితి. స్నేహితులున్నంతసేపూ కాలం తెలియనంతగా ఎంజాయ్ చేసినా వాళ్లు లేనప్పుడు వెలితి తప్ప బెంగ ఉండదు. అందుకే కాబోలు స్నేహితులు దూరమైనా మరో స్నేహాన్ని వెతుక్కోగలం. ఆదిత్య దూరంగా ఉన్నప్పుడు మాత్రం గుండెలోతుల్లోంచి కోరికలాంటి బెంగ పుడుతుంది, చిన్నప్పుడు అమ్మ ఊరెళ్లినప్పుడు అనిపించినట్టు,’ అనుకుంది ముగ్ధ కూరగాయలు కడుగుతూ.

టంగుమని పిలుపు గంట మోగింది.

ఉలిక్కిపడి, 'ఇప్పుడెవరా?' అనుకుంటూ చేతులు తుడుచుకుని వెళ్లి తలుపు తీసింది.

"భయపెట్టానా?" అంటూ నవ్వుతూ లోపలికొచ్చింది అర్చన. "మన యీ వీకెండ్ ప్రోగ్రాం గురించి మాట్లాడుకుని ఫైనలైజ్ చేసుకుంటే మంచిదని వచ్చాను," అంది తలపైని నీటిబిందువుల్ని పైటకొంగుతో వొత్తుకుంటూ. వర్షపుచెమ్మ మీద అలిగి కాటన్ చీర తనలోకి తాను ముడుచుకుంది.

"అది మాట్లాడ్డానికి మూడు బ్లాకుల అవతలినుంచి తడుస్తూ వచ్చావా? ఫోనులో మాట్లాడచ్చుగదా? తువ్వాలిస్తానుండు," అంది ముగ్ధ బెడ్రూంవైపు వెళ్తూ.

"నాకు నేరుగా మాట్లాడితేనే తృప్తి. యెక్కువ తడవలేదులే, వీలైనంతవరకూ వరండాల్లో వచ్చాను. ఆదిత్యలాగే చైతూ కూడా వర్షంలో యిరుక్కున్నాడు. మరో గంటదాకా రాలేడు," అర్చన గలగలా నవ్వింది.

"ఆదిత్య వర్షంలో చిక్కుకున్నట్టు నీకెలా తెలుసు?" తువ్వాలు అందిస్తూ అడిగింది ముగ్ధ.

"లిఫ్టు దగ్గర సిద్దార్థ చెప్పాడు. అతను దిగిన లిఫ్టులోనే నేనెక్కాను."

"అయితే డిన్నర్‌కి యిక్కడికే రమ్మని చైతన్యకు చెప్పు. కలసి తిందాం."

"వద్దు. మధ్యాహ్నం చిన్నత్తయ్యవాళ్లు వస్తామంటే ఐటెమ్స్ యెక్కువగా చేసాను. వాళ్లు రానేలేదు. చైతూ వచ్చాక అవన్నీ ఒవెన్‌లో వేడెక్కడానికి ఫ్రిజ్‌లో యెదురుచూస్తున్నాయి. నీకు సాయం చేస్తాను పద," అంటూ వంటింట్లోని ఐలాండ్ దగ్గరికి దారితీసింది అర్చన.

"కుటుంబాలు చిన్నవయ్యేకొద్దీ రెఫ్రిజిరేటర్లు పెద్దవైపోతున్నాయి," అని నవ్వి వెంట నడిచింది ముగ్ధ.

"సిద్దార్థతో మాట్లాడుతూ నువ్వు చాలాసేపు గడుపుతున్నావు. అతను డిగ్రీలో మీ క్లాస్‌మేటే కాదనను, ఆదిత్య చాలా లిబరల్ అనీ నాకు తెలుసు. కాని చుట్టూ సంఘమనేది వొకటి వుందిగదా? అడిగినందుకు కోపం తెచ్చుకోకు," అంది అర్చన బార్ చైర్లో కూర్చుని కూరగాయల చెక్కు తీస్తూ, కొంచెం తడబడుతూ.

"నువ్వు వరసకు చిన్నాన్న కూతురివేకాదు, స్నేహితురాలివి కూడా. నువ్వు అడగడంలో తప్పులేదు. నువ్వు చెప్పే సంఘంలో నిన్ను మొదటి వ్యక్తిగా అనుకుంటాను," అంది ముగ్ధ నవ్వి.

"వద్దు వద్దు, నన్నా సంఘంలో చేర్చకు. నేనావుద్దేశ్యంతో చెప్పడంలేదు," అర్చన నొచ్చుకుంది.

"సరదాగా అన్నాలే. సిద్దూ నాకంటే ఆదిత్యకే దగ్గరి మిత్రుడు. తెలుసుగదా, స్వభావాల్లో వాళ్లు తూర్పు, పడమర. ఆదిత్యది వుద్యమాల మనస్తత్వం. బ్యాంకు ఆఫీసర్ల యూనియన్‌లో చురుగ్గా వుంటాడు. సిద్దూ తన సాఫ్ట్‌వేర్ వుద్యోగానికి తగినట్టే కంప్యూటర్‌కి అతుక్కుని జడపదార్థంలా వుంటాడు. కానీ అతనికి సంగీతం, సాహిత్యం వుంటే తిండి కూడా అక్కర్లేదు. ఆదిత్యకు ఆసక్తి వున్నా తీరికలేదు. అందుకే నాకూ సిద్ధూకి మంచి స్నేహం యేర్పడింది. నాకు బోరు కొడుతుందని ఆదిత్యే మా స్నేహాన్ని ప్రోత్సహించాడు. ఆదికి మాత్రం వ్యక్తిగత ఆనందంకన్నా పదిమందికి వుపయోగపడే సమాజసేవే ముఖ్యం."

"లోకానికి యిలాంటి స్నేహమొక కొత్తవింత."

"కొత్త కాదు రూపం మారిందంతే. యిదివరకు వుమ్మడికుటుంబాల్లో వొక్కో యింట్లో ఆడా, మగా పల్లెటూళ్ల నుంచి చదువుకోడానికొచ్చిన కజిన్స్‌తో సహా పది మందుండేవాళ్లు. రోజూ వచ్చే స్నేహితులతో ప్రతి యిల్లూ ఓ పెద్ద సత్రం. యిక క్రాస్ స్నేహాలకేం లోటు? కాని అవి పెళ్లితో ముగిసేవి. ముందులాకాక యీ రోజుల్లోని ఆడపిల్లలు కాలేజీల్లో యేర్పడ్డ మంచిస్నేహాలను కొనసాగించాలను కుంటున్నారు. వుద్యోగాలు చేస్తున్నారు కాబట్టి కొత్తస్నేహాలు యేర్పడుతున్నాయి. స్నేహం కూడా ఒక రకమైన మానసిక తృష్ణేమో. యిప్పుడన్నీ మూసిన తలుపుల చిన్న సంసారాలాయె. సంఘం కీ హోల్‌లో నుంచి చూస్తోంది, అంతే. నీకో జరిగిన కథ చెప్పనా?"

"చెప్పు, జరిగిన కథలంటే చెవి కోసుకుంటాను."

"మా స్వంత వూరి చుట్టుపక్కల మా నాన్న జనతా డాక్టరుగా చాలా పాపులర్. ఆ కారణం చేతే ఆయన్ను రాజకీయాల్లోకి దించారు. కొన్ని సంఘాలకు ప్రెసిడెంటుగా వుండేవాడు. యెంపీటీసి మెంబరుగా యేకగ్రీవంగా చాలాసార్లు యెన్నుకున్నారు. తీరికలేని ప్రాక్టీసు. వ్యవసాయం కూడా వుండేది. పెద్ద పెంకుటిల్లు, బంధువులతో సహా వచ్చిపోయే జనం. మా అమ్మకు యింటి పనులు, వంటలతోనే తీరిక లేకుండా వుండేది. మమ్మల్ని పట్టించుకునే సమయం వుండేదికాదు. యింటి కొచ్చిన రాజకీయ నాయకుల్ని, అధికారుల్ని సరిగ్గా పలకరించేవాళ్లు లేకపోయారు. ఆ తరువాత మా పెద్దమ్మ వచ్చి మమ్మల్ని ఆదుకుంది."

“మేమెక్కువగా నార్త్‌లో వున్నాం. నాకన్నీ గుర్తులేవు. యీ పెద్దమ్మెవరు?”

“మా అమ్మకు పిన్నికూతురు. మొదట్లో వాళ్లు మా వూరికి యాభైమైళ్ల దూరంలో వుండేవాళ్లు. మా పెద్దమ్మ తెలివైంది, వ్యవహారకర్త. అయినా ఆమె చేతికి పగ్గాలు వచ్చేసరికి వుమ్మడి కుటుంబం చితికిపోయింది. పెదనాన్న అమాయకం, పిల్లలు లేరు. యే దారీ లేక మా యింటికి వలస వచ్చారు. ఆమె వచ్చాక మా వ్యవహారాలు, వ్యవసాయపనులే కాదు విజిటర్స్ అందర్నీ చక్కగా మేనేజ్ చేసేది. మా అమ్మకు మాతో గడిపే తీరిక దొరికేది.”

“మా యిన్స్యూరెన్స్ భాషలో చెప్పాలంటే మీ యింటి ఫ్రంట్ ఆఫీసుకి మేనేజరుగా చేసేదన్నమాట,” నవ్వింది అర్చన.

“రోజూ రాత్రి మా నాన్న క్లినిక్ నుంచి వచ్చి భోంచేసాక, వాళ్లిద్దరూ పగలు జరిగినవన్నీ పొద్దుపోయేదాకా మాట్లాడుకునేవాళ్లు. మరుసటి రోజుకి చెయ్యాల్సిన పనుల మీద నిర్ణయాలు తీసుకునేవాళ్లు. ఆవిధంగా ఆమె మాకు మరో పెద్ద దిక్కైంది.”

“మీ పెద్దమ్మను వొకట్రెండుసార్లు చూసిన గుర్తొస్తోంది. ఆ వయసులోనూ మనిషి బావుండేది కదా? మరి వూళ్లోవాళ్లు యేమీ అనుకునేవారు కాదా?“

“కొందరు అనుకునేవారు, కొందరు పట్టించుకోలేదు. అప్పటి సమాజం యింకో రకం.”

“మీ అమ్మ?”

“చాలారోజులయ్యాక నేను మా అమ్మను అదే అడిగాను. ‘మీ పెద్దమ్మ వుండడం మీ నాన్నకు అవసరం. మా చిన్నతనంలో పెద్ద కుటుంబాల్లో నలుగురు మనుషులుండి పనులను పంచుకునేవాళ్లు. మీ పెద్దమ్మ మనలో వొకరుగా వుంది. అలా కలసిపోయే మనుషులు దొరకడమే గగనం. గీత దాటకపోవడమన్నది మన చేతుల్లోనే ఉంది. గీత దాటనంతవరకూ, ‘మూడోమనిషి’ కానంతవరకూ, వొక మంచి స్నేహితురాలు వుంటే నష్టమేముంది?’ అని యెదురు ప్రశ్న వేసింది.”

“యిలా అడగడంలో నేను గీత దాటి వుంటే సారీ,” అంది అర్చన.

“యిప్పుడు మనవన్నీ శాటిలైట్ కుటుంబాలు, చాలావరకూ వుద్యోగం చేసే ఆడవాళ్లే. అంతేనా? డైవోర్సీలు, సింగిల్ పేరెంట్స్, సహజీవనాల శకం మొదలైంది. మరోమనిషితో వ్యావహారిక అవసరాలేకాదు, మానసిక అవసరాలు కూడా యేర్పడు

తున్నాయి. అదే సమయంలో చదువు, అవగాహన వల్ల పరిణతి కూడా పెరిగింది. మారుతున్న కాలంలో యిలాంటి పరిణామాలని పాజిటివ్‌గా తీసుకోవాలేమో,'' అంటూ కూరగాయల్ని తరగడం పూర్తిచేసింది ముగ్ధ.

''నిజమే, వొక్కోసారి సరైన ఆడ స్నేహితులు దొరక్కపోవచ్చు. యివాళ యిలాంటి షార్ప్‌గా వున్న పాఠం చెప్పి 'మంచి టీచరమ్మను' అనిపించుకున్నావు,'' అని కడుగుతున్న కత్తిని చూపించి పెద్దగా నవ్వింది అర్చన.

కూరగాయల ముక్కల్ని కుక్కర్లో పెట్టి హాల్లోకి వచ్చారు.

అర్చన ఫోన్‌కి మెస్సేజ్ వచ్చింది. చూసుకుని, ''చైతూ దగ్గరికొచ్చేసాడు. యింటి తాళంచెవులు నా దగ్గరే వున్నాయి. నేనొచ్చిన విషయం మాట్లాడనేలేదు. రేప్పొద్దున్నే ఫోన్ చేస్తా,'' అంటూ హడావుడిగా వెళ్లిపోయింది.

తలుపువేసి వచ్చి సోఫాలో చేరగిలబడి కూర్చుంది ముగ్ధ. ఆలోచనలు కొనసాగాయి.

'వసుమతి తనకంటే అందంగా ఉంటుంది, చక్కగా ఫిజిక్ మెయింటైన్ చేస్తుంది,' అనుకుంది ముగ్ధ. ఒక్కోసారి తనకుతానే సంఘం దృష్టితో ఆలోచించి భరోసా ఇచ్చుకుంటుంది. ఆమెకు నవ్వొచ్చింది.

'సిద్దూలాంటి మనుషులు అరుదు. ఉన్నంతసేపూ ఎవరికైనా దగ్గరి స్నేహితుడిలా అయిపోతాడు. ఎప్పుడోగాని ఆలోచనల్లోకి రాడు. తన ఉనికే అలా ఉండేట్టు చూసుకుంటాడు. అన్నయ్య, వదిన ఇండియాలో లేనప్పుడు ఆరోజు అమ్మకు హఠాత్తుగా జబ్బుచేసి సర్జరీ అవసరమై ఊరి నుంచి తీసుకొచ్చారు. ఆదిత్య అంతా నెత్తినేసుకుని డాక్టర్ల చుట్టూ తిరుగుతున్నాడు. ఆస్పత్రిలో అమ్మను అలా చూసి కళ్లలో నీరు ఆవిరై తను ఒంటరైపోయింది. తనను ఇంటికి ఆస్పత్రికి తిప్పుతూ అమ్మ రూములో దూరంగా కూర్చుని తనని కళ్లతో, మనసుతో ఓదార్చాడు సిద్దూ. వసుమతి కూడా చాలా సహాయపడింది. ఆరోజుల్లోనే అలాంటి స్నేహితుల అవసరం తనకు తెలిసివచ్చింది. అలా అందరికీ అవసరమా లేక తను బలహీనురాలా?' అనుకుంటూ నిట్టూర్చింది.

మళ్లీ పిలుపు గంట మోగింది, ఈసారి ఆదిత్య. ఆదిత్యను చూడగానే లోపల్నుంచి ఉద్వేగం ఒక్కసారిగా ఆమెను కమ్మేసి అతని ఎదమీద తలవాల్చి వీపు చుట్టూ గట్టిగా చేతులను పెనవేసింది.

“వర్షంలో ఆలస్యమైంది అంతేగా? వురుములకు భయపడ్డావా? తోడుగా వుండమన్నా ఆ యిడియట్ వెళ్లిపోయాడు,” అన్నాడు ఆదిత్య ఆమె చుట్టూ చెయ్యివేసి మురిపెంగా నవ్వి.

“అప్పటికే వసుమతి యింటికి తిరిగొచ్చే టైం అయిందిగదా.”

“నువ్వే పంపించేసి వుంటావు. చుట్టుపక్కలవాళ్లు యేమనుకుంటారో అని నీ భయం,” ఆదిత్య చిరుకోపం చూపించాడు.

“దేని టైంలో అది జరగాలి. లేకుంటే ఆరోగ్యం పాడవుతుంది,” అని నవ్వి, “త్వరగా స్నానం చేసిరా డిన్నర్ చేద్దాం, ఆలస్యమైంది,” అంది ముగ్ధ వంటింటి వైపు వెళ్తూ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*3 జులై 2022*

❋



డా. కె.వి. రమణరావు 22 నవంబర్ 1957న జన్మించారు. మొదటి కథ పరుగు పందెం 24 మే 2006 నవ్య వీక్లీలో అచ్చయ్యింది. డెబ్భైకి పైగా కథలు రాశారు. పుట్టిల్లు కథాసంపుటి ప్రచురించారు. మరో సంపుటి బురుజు వీధి కథలు ప్రచురణలో ఉంది. కొన్ని వ్యాసాలు, కథాసమీక్షలు రాశారు. అధ్యాపక వృత్తిలో పదవీ విరమణ చేశారు.

***చిరునామా: 3-13-15/5, 1బి, మధురానగర్, రామంతపూర్, హైదరాబాద్-500013***
***ఫోన్: 98491 23265 kvrr1947@gmail.com***